క్లుప్తంగా

బీఆర్‌ఎస్‌లో చేరిన కిరణ్



తెలంగాణభవన్‌లో కేటీఆర్‌తో కిరణ్

భైంసాటౌన్‌: కాంగ్రెస్‌ పార్టీకి రాజీనామా చేసిన కిరణ్‌ ఫౌండేషన్‌ చైర్మన్‌ డాక్టర్‌ కిరణ్‌ కొమ్రేవార్‌ బీఆర్‌ఎస్‌లో చేరారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్‌ఎస్‌ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కేటీఆర్‌ సమక్షంలో మంగళవారం గులాబీ కండువా కప్పుకున్నారు. అంతకుముందు భైంసా పట్టణంలోని తన నివాసం వద్ద కాంగ్రెస్‌ పార్టీ ఫ్లెక్సీలు, కరపత్రాలను దహనం చేశారు. ముధోల్‌ ఎన్నికల ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్‌కుమార్‌, పార్టీ అధికార ప్రతినిధి పడకంటి రమాదేవి ఆయన నివాసానికి వెళ్లి మాట్లాడారు. అనంతరం భారీ వాహన శ్రేణితో హైదరాబాద్‌కు వెళ్లి కేటీఆర్‌ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు.

బాధితులకు సరుకులు, నగదు అందజేత

కడెం: మండలంలోని చిన్నబెల్లాల్‌ గొండుగూడకు చెందిన భీంరావు, మోహన్‌ ఇటీవల విద్యుత్‌ షాక్‌తో మరణించిన సంగతి తెలిసిందే. సోమవారం రాత్రి బాధిత కుటుంబాలను బీసీ యూత్‌ అసోషియేషన్‌ రాష్ట్ర కార్యదర్శి సొదాని రమణాయాదవ్‌ పరామర్శించి, నిత్యావసర సరుకులతోపాటు రూ.ఆరు వేల నగదు అందించారు. కార్యక్రమంలో తుడుం దెబ్బ నాయకులు రవి, అజ్మీరా రాజేశ్‌ నాయక్‌, తిరుపతినాయక్‌, దేవేందర్‌, శ్రీనివాస్‌, ఆనంద్‌ తదితరులు ఉన్నారు.

రూ.ఐదు వేల సాయం

కడెం: మండలంలోని పాండ్వపూర్‌ పంచాయతీలోని తండాకు చెందిన అజ్మీరా నరేశ్‌ ఇటీవల అనారోగ్యంతో మరణించాడు. మంగళవారం బాధిత కుటుంబానికి 'జైజవాన్‌..జైకిసాన్‌ ఫౌండేషన్‌' సభ్యులు రూ.ఐదు వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్‌ సభ్యులు బుగ్గారం లింగన్న, దావనపెల్లి రాజశేఖర్‌, పెట్టెం నరేశ్‌, మల్లేశ్‌, వినోద్‌, వసంత్‌, రవి, ఉత్తర్‌, రామారావు తదితరులు ఉన్నారు.

యాదవసంఘం కార్యవర్గం



నూతన కార్యవర్గం

తానూరు: మండలంలోని భోసి గ్రామంలో మంగళవారం యాదవ సంఘం గ్రామ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షుడిగా ధోని శ్రీనివాస్‌యాదవ్‌, ఉపాధ్యక్షుడిగా రాజారాం యాదవ్‌, కార్యదర్శిగా గుమ్మల రాజేశ్వర్‌, సభ్యులుగా లక్ష్మణ్‌, మల్లేశ్‌, మురళి, శంకర్‌, సాయినాథ్‌, నవీన్‌, అశోక్‌, చిన్నమల్లేశ్‌ను ఎన్నుకున్నారు. అనంతరం కార్యవర్గాన్ని నాయకులు సన్మానించారు.

మండల సమావేశం వాయిదా

ముధోల్‌: మండల పరిషత్‌ కార్యాలయంలో మంగళవారం నిర్వహించాల్సిన మామడ మండల సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా వేసినట్లు ఎంపీడీవో సురేశ్‌బాబు తెలిపారు. మళ్లీ సమావేశం నిర్వహించే తేదీని త్వరలో ప్రకటిస్తామని పేర్కొన్నారు.

ఓటుహక్కు వినియోగించుకోవాలి



అవగాహన కల్పిస్తున్న అధికారులు

దస్తురాబాద్‌: అర్హులందరూ తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని ఏపీడీ గోవిందరావ్‌ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలో స్వీప్‌ ఆధ్వర్యంలో ఓటుహక్కు ఆవశ్యకతను వివరిస్తూ పాఠశాలల విద్యార్థులు, డ్వాక్రా సంఘం మహిళలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. డీపీఎం శోభారాణి, ఎంపీడీవో విజయ్‌భాస్కర్‌, ఎన్నికల ప్రత్యేకాధికారి వెంకటేశ్వర్లు, ఏపీఎం గంగన్న, ఐకేపీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అల్ఫోర్స్‌లో ముందస్తు దీపావళి

భైంసాటౌన్‌: పట్టణంలోని అల్ఫోర్స్‌ పాఠశాలలో మంగళవారం ముందస్తు దీపావళి వేడుకలు నిర్వహించారు. విద్యాసంస్థల చైర్మన్‌ నరేందర్‌రెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్షీరాభిషేకం

కుంటాల: పేదలకు ఐదేళ్లు ఉచిత బియ్యం పంపిణీ చేస్తామని ప్రకటించినందుకు మంగళవారం మండలంలోని కల్లూర్‌లో ప్రధాని చిత్రపటానికి బీజేపీ నాయకులు క్షీరాభిషేకం చేశారు. అనంతరం శివాలయంలో పూజలు నిర్వహించారు. నర్సయ్య, లక్ష్మణ్‌పటేల్‌, రజినీకాంత్‌, రవి, శ్రీనివాస్‌ పాల్గొన్నారు.

అభివృద్ధిలో ఖానా'పూర్‌'..!

- మున్సిపాలిటీలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు లేక ఇక్కట్లు
- నత్తనడకన రోడ్డు విస్తరణ పనులు
- పూర్తికాని సమీకృత మార్కెట్‌ భవనం
- జోరుగా అక్రమ లేఅవుట్ల దందా
- గోస పడుతున్న పట్టణవాసులు



అసంపూర్తిగా సమీకృత మార్కెట్‌ భవనం

ఖానాపూర్‌: మున్సిపాలిటీ ప్రాంతమైన ఖానాపూర్‌లో అభివృద్ధి ఒక అడుగు ముందుకు ఏడడుగులు వెనక్కి అన్న చందంగా మారింది. పాలన సౌలభ్యం కోసం మేజర్‌ పంచాయతీ నుంచి మున్సిపాలిటీగా ఏర్పడినా.. వీధుల్లో కనీసం సీసీరోడ్లు, డ్రైనేజీల నిర్మాణం చేపట్టలేదు. సమీపంలోని తిమ్మాపూర్‌ గ్రామాన్ని విలీనం చేయడంలో పట్టణ పరిధి పెరిగింది. మున్సిపాలిటీగా మారితే నిధులు పెరిగి ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయనుకున్న పట్టణవాసులకు నిరాశే మిగిలింది. గత ఎన్నికల వేళ ఇచ్చిన హామీలు అమలు కాలేదు. సొంతభవనం లేక నేటికి పంచాయతీ భవనంలోనే మున్సిపల్‌ కార్యాలయం కొనసాగుతోంది. పట్టణంలో చేపట్టిన అభివృద్ధి పనులు సైతం నిలిచిపోయాయి.

నెరవేరని హామీలివే..

- పట్టణంలో 50 పడకల సీహెచ్‌సీ(సామాజిక ఆరోగ్య కేంద్రం)ని 100 పడకలుగా అభివృద్ధి చేస్తామని ఇచ్చిన హామీ నెరవేర్చలేదు. సాయిబాబా ఆలయం నుంచి పోలీస్‌స్టేషన్‌ వరకు రెండు కిలోమీటర్ల మేర చేపట్టిన రోడ్డు విస్తరణ పనులు సగమే పూర్తయ్యాయి.
- పట్టణంలోని పద్మావతినగర్‌లో చేపట్టిన సమీకృత వ్యవసాయ మార్కెట్‌ భవన నిర్మాణ పనులు పూర్తికాలేదు.
- మున్సిపాలిటీగా ఏర్పడినప్పటి నుంచి పట్టణంలో సీసీరోడ్లు, డ్రెయినేజీలు నిర్మించలేదు.
- గోదావరి తీరం సమీపంలో రూ.60 లక్షలతో నిర్మించిన వైకుంఠధామం ఏటా వర్షాకాలంలో వరదలో మునిగి దెబ్బతింటుంది.
- తహసీల్దార్‌ కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరిన నూతన భవనం నిర్మించడం లేదు.
- సొంత భవనాల్లేక.. పలు ప్రభుత్వ కార్యాలయాలు, వసతిగృహాలు, రెషిడెన్షియల్‌ పాఠశాలలను అద్దె భవనాల్లో కొనసాగిస్తున్నారు.

అభివృద్ధికి దూరంగా..

1978 నుంచి నియోజకవర్గ కేంద్రంగా, పాత తాలుకాకేంద్రంగా, మేజర్‌ గ్రామపంచాయతీగా ఖానాపూర్‌ రూపుదిద్దుకున్నా అభివృద్ధికి మాత్రం ఆమడ దూరంలోనే ఉంది. ప్రధానంగా అంతర్గత రోడ్ల మరమ్మతులు, రహదారుల విస్తరణ, సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం, హైమాస్టు లైట్లు ఏర్పాటు వంటి పనులు చేపట్టలేదు. రోడ్లు సరిగా లేక మున్సిపాలిటీలో నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతుండటంతో పలువురు గాయాల పాలవుతున్నారు.

యథేచ్ఛగా అక్రమలేఅవుట్ల దందా..

మున్సిపాలిటీ ఏర్పాటు ప్రకటన వెలువడిన నాటి నుంచే రియల్‌ఎస్టేట్‌ రంగం పుంజుకుంది. దీంతో కొందరు వ్యాపారులు అక్రమ లే అవుట్లను ఏర్పాటు చేసి లాభాలు గడిస్తున్నారు. నిబంధనల విషయంలో అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

ఉపాధిహామీకి మంగళం..

ఖానాపూర్‌ మున్సిపాలిటీగా ఏర్పడటంతో ప్రజలకు పన్నుల భారం పెరిగింది. ఖానాపూర్‌లో సుమారు ఐదు వేల మంది ఉపాధి హామీ పనులకు వెళ్లే కూలీలుండగా.. మున్సిపాలిటీ ఏర్పాటుతో వారు ఉపాధి కోల్పోయారు. పలుమార్లు అధికారులను వేడుకున్నా.. తమకు ఉపాధి కల్పించడం లేదని వారు వాపోతున్నారు.

సమస్యలు పరిష్కరించాలి..

ఇప్పటికైనా అధికారులు, పాలకులు చొరవ చూపి ఖానాపూర్‌ మున్సిపాలిటీలో అసంపూర్తిగా ఉన్న అభివృద్ధి పనులు, ప్రజా సమస్యలు పరిష్కరించాలని పట్టణవాసులు వేడుకుంటున్నారు.

ఫిర్యాదు చేశాం

పట్టణంలోని గోదావరి తీరంలో రూ.60 లక్షలతో నిర్మించిన వైకుంఠదామం వరదకు మునుగుతోంది. మిషన్‌ భగీరథ, ఇతర పనుల్లో లో అవినీతి జరిగిందని ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేసినా విచారణ చేయ లేదు. అక్రమ లేవుట్‌లు, అక్రమ నిర్మాణాలను కట్టడి చేయడంలో యంత్రాంగం విఫలమైంది. – తిలక్‌రావు, ఖానాపూర్‌

నిరసనలు చేపట్టాం

మున్సిపాలిటీలో అవినీతి అక్రమాలు, పనుల నాణ్యతలోపంపై కమిషనర్‌ నుంచి కలెక్టర్‌ వరకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదు. రోడ్డు పనుల్లో జాప్యంపై సైతం నిరసనలు చేపట్టాం. పైపులైన్లకు లీకేజీలు ఏర్పడి ప్రజలు కలుషిత నీరు తాగి రోగాల బారిన పడుతున్నారు.

– చిన్నం సత్యం, కాంగ్రెస్‌ మున్సిపల్‌ ఫ్లోర్‌లీడర్‌

పనులు వేగవంతం చేశాం

గతంలో కొంత జాప్యం జరిగినప్పటికీ ప్రస్తుతం పనులను వేగవంతం చేశాం. మూడు రోజుల్లో జూనియర్‌ కళాశాల నుంచి బాబా ఆలయం వరకు రోడ్డుపై బీటీ పనులు పూర్తవుతాయి. రూ.3.09 కోట్లతో చేపట్టిన సమీకృత మార్కెట్‌ భవన నిర్మాణ పనులు 70 శాతం పూర్తయ్యాయి. మున్సిపల్‌ భవనం నిర్మించేందుకు రూ.మూడు కోట్లతో టెండర్లు పూర్తయ్యాయి. రూ.13 కోట్లతో నిర్మించే సీసీ రోడ్లు, డ్రెయినేజీలకు సైతం టెండర్లు పూర్తయ్యాయి. ఎన్నికల కోడ్‌ పూర్తికాగానే పనులు ప్రారంభిస్తాం.

– శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్‌ కమిషనర్‌

'బోథ్‌ టికెట్‌ అశోక్‌కే ఇవ్వాలి'

మామడ: బోథ్‌ కాంగ్రెస్‌ ఎమ్మెల్యే టికెట్‌ను అశోక్‌కు ప్రకటించి.. మళ్లీ ఇతరులకు కేటాయించడం ఆదివాసీ నాయక్‌పోడ్‌లను అవమానించడమేనని తుడుందెబ్బ నాయకుడు శ్రీనివాస్‌ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అశోక్‌కు టికెట్‌ ఇవ్వకుంటే ఉమ్మడి జిల్లాలోని కాంగ్రెస్‌ అభ్యర్థులకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకపోడ్‌ సంఘం నాయకులు శ్రీనివాస్‌, భీమేశ్‌, అశోక్‌, సురేశ్‌ తదితరులు ఉన్నారు.

'నేటి కాంగ్రెస్‌ సభకు తరలిరండి'

ఖానాపూర్‌: ఉట్నూర్‌లో బుధవారం కాంగ్రెస్‌ ఖానాపూర్‌ ఎమ్మెల్యే అభ్యర్థి వెడ్మ బొజ్జు ఆధ్వర్యంలో నిర్వహించే బహిరంగ సభలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పాల్గొంటారని.. నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని ఆ పార్టీ మండలాధ్యక్షుడు దయానంద్‌, మున్సిపల్‌ కాంగ్రెస్‌ ఫ్లోర్‌ లీడర్‌ చిన్నం సత్యం పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో షబ్బీర్‌ పాషా, నిమ్మల రమేశ్‌, గంగనర్సయ్య, తోట సత్యం, రాజునాయక్‌, జహీర్‌ అహ్మద్‌, జంగిలి శంకర్‌, అమానుల్లాఖాన్‌, తదితరులు ఉన్నారు.

'బీఆర్‌ఎస్‌కే మద్దతు'

లక్ష్మణచాంద: మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన 420 వడ్డెర కుటుంబాలు ఇంద్రకరణ్‌రెడ్డికే మద్దతు ఇస్తూ తీర్మానం చేసినట్లు వడ్డెర సంఘం మండలాధ్యక్షుడు మక్కల నాగయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇటీవల మంత్రి ఐకేరెడ్డిని కలిసినప్పుడు తమ సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఆసంఘం ప్రధాన కార్యదర్శులు సురేశ్‌, పల్లపు రవీందర్‌, క్యాషియర్‌ రాజు, సభ్యులు రవి, రాజేశ్వర్‌, సుమన్‌, మహేశ్‌ తదితరులు పాల్గొన్నారు.

అన్నివర్గాల అభివృద్ధే బీఆర్‌ఎస్‌ ధ్యేయం

- మంత్రి ఐకేరెడ్డి
- గ్రామాల్లో నాయకులతో ప్రచారం

సోన్‌: అన్నివర్గాల ప్రజల అభివృద్ధే బీఆర్‌ఎస్‌ ప్రభుత్వ ధ్యేయమని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో బీఆర్‌ఎస్‌ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. న్యూవెల్మల్‌ గ్రామంలో మహిళలు ఆయనకు మంగళహారతులతో ఘనస్వాగతం పలికారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముంపునకు గురైన న్యూవెల్మల్‌లో సేత్వారి సమస్యను ఎన్నికల అనంతరం పరిష్కరిస్తామన్నారు.అనంతరం బొప్పారం, సంగంపేట, కూచన్‌పెల్లి, సాకేర, కడ్తాల్‌, గంజాల్‌, సోన్‌ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌ మాజీ రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణగౌడ్‌, పీఏసీఎస్‌ చైర్మన్‌ కృష్ణప్రసాద్‌రెడ్డి, బీఆర్‌ఎస్‌ మండలాధ్యక్షుడు మోహినొద్దీన్‌, అంద్‌రెడ్డి, మహేశ్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్‌ మాజీ సర్పంచ్‌లు తోట సాయన్న, రాజేశ్వర్‌, గ్రామ అధ్యక్షులు నర్సయ్య, కిరణ్‌రావు, భీమేశ్‌, భూమేశ్‌, మల్లయ్య, మహేందర్‌, శ్రీనివాస్‌, దయాకర్‌, సురేశ్‌యాదవ్‌, ప్రశాంత్‌, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.



సోన్‌: న్యూవెల్మల్‌లో మంత్రికి స్వాగతం పలుకుతున్న నాయకులు

బీఆర్‌ఎస్‌లో చేరిక

నిర్మల్‌టౌన్‌: జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి సమక్షంలో మంగళవారం సారంగపూర్‌ మండలం జామ్‌ గ్రామానికి చెందిన యాదవ సంఘం సభ్యులు, సోనాపూర్‌, గోపాల్‌పేట్‌, హర్కయి తండాకు చెందిన 200 మంది బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి మంత్రి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మున్సిపల్‌ మాజీ చైర్మన్‌ అప్పాల గణేశ్‌, దేవేందర్‌యాదవ్‌, అల్లోల మురళీధర్‌ రెడ్డి, పాకల రాంచందర్‌, రంజిత్‌రెడ్డి, అల్లోల గౌతమ్‌రెడ్డి, తిరుపతిరెడ్డి ఉన్నారు.

మామడ: మండలంలోని పొన్కల్‌, ఆరేపల్లి గ్రామాలలో బీఆర్‌ఎస్‌ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. హరీశ్‌కుమార్‌, సుధాకర్‌రెడ్డి, గంగన్న, ముత్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే ప్రజాసమస్యల పరిష్కారం

- ముధోల్‌ అభ్యర్థి రామారావ్‌ పటేల్‌

లోకేశ్వరం: బీజేపీ అధికారంలోకి వస్తేనే ప్రజాసమస్యలు పరిష్కారం అవుతాయని ఆ పార్టీ ముధోల్‌ ఎమ్మెల్యే అభ్యర్థి రామారావ్‌ పటేల్‌ అన్నారు. మంగళవారం మండలంలోని ఎడ్డూర్‌-పొట్‌పల్లి, మన్మద్‌, రాజూర గ్రామాల్లో బీజేపీ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా గ్రామాల బీఆర్‌ఎస్‌ కార్యకర్తలు బీజేపీలో చేరారు. రాజేశ్‌బాబు, చిన్నారావు, జయసాగర్‌, జీవన్‌, రమేశ్‌, మెండె శ్రీధర్‌, లక్ష్మణ్‌రావు, సుమన్‌కుమార్‌, భాస్కర్‌, సాగర్‌గౌడ్‌ ఉన్నారు.

భైంసాటౌన్‌: పట్టణంలోని గణేశ్‌నగర్‌లో బీజేపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. ముందుగా స్థానిక హనుమాన్‌ ఆలయంలో పూజలు నిర్వహించారు. పట్టణ అధ్యక్షుడు మల్లేశ్వర్‌, రావుల పోశెట్టి, నాగనాథ్‌, అనిల్‌, శ్రీనివాస్‌ తదితరులున్నారు.

ముధోల్‌: రాంరావుపటేల్‌ను ఎమ్మెల్యేగా గెలిపించాలని జెడ్పీటీసీ మాజీ సభ్యులు లక్ష్మీనర్సాగౌడ్‌ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో అంబేడ్కర్‌ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రువి, బ్రాహ్మణ్‌గావ్‌ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో దత్తారాం పటేల్‌, కిసాన్‌ మోర్చా జిల్లా అధ్యక్షుడు ముత్యం రెడ్డి, మండలాధ్యక్షుడు కోరి పోతన్న, తరోడా సర్పంచ్‌ శ్వేతరవికిరణ్‌గౌడ్‌, రమేశ్‌, పోతన్న, సంతోష్‌, రాజు తదితరులున్నారు.



లోకేశ్వరం: రామారావ్‌ పటేల్‌కు స్వాగతం పలుకుతున్న ఎడ్డూర్‌-పొట్‌పల్లి గ్రామస్తులు

కుంటాల: ముధోల్‌ ఎమ్మెల్యేగా పవార్‌ రామారావు పటేల్‌ను గెలిపించాలని కోరుతూ మండలంలోని కల్లూర్‌లో బీజేపీ నాయకులు ఇంటింటా ప్రచారం చేశారు. ఆ పార్టీ మండల కన్వీనర్‌ గుద్దేటి నర్సయ్య, లక్ష్మణ్‌ పటేల్‌, రజినీకాంత్‌, సాయికిరణ్‌, శ్రీనివాస్‌, దత్తు తదితరులు పాల్గొన్నారు.

భైంసారూరల్‌: ముధోల్‌ ఎమ్మెల్యేగా బీజేపీ అభ్యర్థి పవార్‌ రామారావుపటేల్‌ను గెలిపించాలని ఆయన తనయుడు సందీప్‌పటేల్‌ కోరారు. మంగళవారం మండలంలోని కుంసరలో ప్రచారం నిర్వహించారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు తాలోడ్‌ శ్రీనివాస్‌, రజాక్‌, పండిత్‌రావు, మధుకర్‌, విఠల్‌, ఆనంద్‌ రావుపటేల్‌, శ్రీనివాస్‌, దిగంబర్‌ తదితరులు ఉన్నారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

ఖానాపూర్‌: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే రైతుల పంటలకు మద్దతు ధర అందుతుందని అధికారులు పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో ఖానాపూర్‌ పీఏసీఎస్‌ ఆధ్వర్యంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అధికారులు ప్రారంభించారు. కేంద్రాలకు రైతులు తాలు, తప్ప లేకుండా ధాన్యం తెచ్చి ఆరబెట్టాలని సూచించారు. కార్యక్రమంలో అగ్రికల్చర్‌ ఏడీఏ సుజాత, వ్యవసాయ మార్కెట్‌ కమిటీ సెక్రెటరీ సయ్యద్‌ అజంఅలీ, ఖానాపూర్‌ సీఈవో ఆశన్న, సత్తన్‌పల్లి సీఈవో శ్రీనివాస్‌, సిబ్బంది భూమేశ్‌ తదితరులు ఉన్నారు.

పీచరలో..

లక్ష్మణచాంద: మండలంలోని పీచరలో పీఏసీఎస్‌ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మండల వ్యవసాయాధికారి ప్రవీణ్‌ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు చేపట్టాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో ఏఈవోలు సంతోష్‌, పవిత్ర, సీఈవో ఉదయ్‌ తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో విధులు నిర్వర్తిస్తే గుర్తింపు

కుంటాల: అంకితభావంతో పని చేస్తే గుర్తింపు లభిస్తుందని ఎంఈవో వాటోలి ముత్యం పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో పని చేసిన, బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులను సన్మానించారు. ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజమేనని.. ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలని కోరారు. గజపల్లి నర్సయ్య, నాహిపాషా, సురేందర్‌, గంగన్న, దుర్గ, ప్రేమ, చంద్రనాగాకాంత్‌, రతన్‌కుమార్‌, ధర్మాజీ, లక్ష్మణ్‌, మారుతి, గంగాధర్‌, సాహెబ్‌రావు, ముకిం, భోజన్న, సంగీత తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి కోసం బీజేపీని గెలిపించాలి

- నిర్మల్‌ ఎమ్మెల్యే అభ్యర్థి మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్‌: నిర్మల్‌లో అభివృద్ధి కోసం బీజేపీని గెలిపించాలని ఆ పార్టీ అభ్యర్థి ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని మహేశ్వర్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో సారంగపూర్‌ మండలం కొట్ల(బి), వంజర్‌, మలక్‌చించోలితోపాటు సోన్‌ మండలం బొప్పారం, నిర్మల్‌రూరల్‌ మండలం కొట్ల(కె), తాంస గ్రామాల నాయకులు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నల్ల రాంశంకర్‌రెడ్డి, చంద్రప్రకాశ్‌గౌడ్‌, ముత్యంరెడ్డి, చెన్న రాజేశ్వర్‌, బడి పోతన్న, సాధు రాంరెడ్డి, ఇప్ప శ్రీకాంత్‌రెడ్డి, రాజురెడ్డి, దయాకర్‌రెడ్డి, గోవింద్‌రెడ్డి, పాపరెడ్డి, స్వాగత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నేతల ప్రచారం..

లక్ష్మణచాంద: నిర్మల్‌ ఎమ్మెల్యేగా మహేశ్వర్‌రెడ్డిని గెలిపించాలని మండలంలోని పొట్టపెల్లి, కనకాపూర్‌, వడ్యాల్‌, లక్ష్మణచాంద గ్రామాల్లో బీజేపీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆ పార్టీ మండలాధ్యక్షుడు గోవర్ధన్‌, రంజిత్‌, భరత్‌, రమణగౌడ్‌, నాగుల రాజు, అశోక్‌, రాకేశ్‌, గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన బీఆర్‌ఎస్‌ ఎంపీటీసీ

సారంగపూర్‌: మండలంలోని మలక్‌చించోలి గ్రామ ఎంపీటీసీ సభ్యురాలు అగ్గం సరిత బీఆర్‌ఎస్‌ నుంచి బీజేపీలో చేరారు. మంగళవారం మలక్‌చించోలిలో మహేశ్వర్‌రెడ్డి.. ఎంపీటీసీతోపాటు ఆమె భర్త వెంకట్‌రెడ్డికి కండువా కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో విలాస్‌, రాంశంకర్‌ రెడ్డి, చంద్రప్రకాశ్‌గౌడ్‌, గంగాధర్‌, విజయ్‌, తదితరులు ఉన్నారు.



బీజేపీలో చేరిన వారితో మహేశ్వర్‌రెడ్డి

పార్టీ కార్యాలయం ప్రారంభం..

సోన్‌: బీజేపీకి ఓటేయాలని మండలంలోని మాదాపూర్‌, పాక్‌పట్ల, న్యూవెల్మల్‌ గ్రామాల్లో బీజేపీ అభ్యర్థి మహేశ్వర్‌రెడ్డి సతీమణి కవితారెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం న్యూవెల్మల్‌లో పార్టీ కార్యాలయాన్ని సర్పంచ్‌ గంగామణితో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గంగన్న, ఎంపీటీసీ నాగయ్య, దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు రాచకొండ సాగర్‌, మారగంగారెడ్డి, హరీశ్‌రెడ్డి, శ్రీనివాస్‌ పాల్గొన్నారు.

'బీసీ గర్జన'కు తరలిన నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్‌: బీజేపీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో మంగళవారం నిర్వహించిన బీసీ గర్జన బహిరంగ సభకు జిల్లా నుంచి పలువురు నాయకులు తరలి వెళ్లారు. నిర్మల్‌ నుంచి ఆ పార్టీ నాయకులు ప్రత్యేక వాహనాల్లో తరలివెళ్లారు. ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పొన్నం నారాయణ గౌడ్‌, కొండాజీ నరేంద్ర, తోట సత్యనారాయణ, భీమేశ్‌ తదితరులు పాల్గొన్నారు.

భైంసా నుంచి..

భైంసాటౌన్‌: హైదరాబాద్‌లో నిర్వహించిన బీజేపీ బీసీ జనగర్జన సభకు భైంసా నుంచి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. పట్టణంలోని ఎస్‌ఎస్‌ కాటన్‌ నుంచి ప్రత్యేక వాహనాల్లో హైదరాబాద్‌ వెళ్లారు. ఆ పార్టీ అసెంబ్లీ కన్వీనర్‌ తాడేవార్‌ సాయినాథ్‌, భోజన్న, బాజనోల్ల గంగాధర్‌, గోపి భోజారాం, శ్రీనివాస్‌, శ్రీకాంత్‌గౌడ్‌, మల్లేశ్‌, పోశెట్టి తదితరులున్నారు.

మైనార్టీల సంక్షేమమే లక్ష్యం

- ఖానాపూర్‌ బీఆర్‌ఎస్‌ అభ్యర్థి జాన్సన్‌

ఖానాపూర్‌: మైనార్టీల సంక్షేమమే లక్ష్యంగా కేసీఆర్‌ ప్రభుత్వం పని చేస్తోందని ఖానాపూర్‌ బీఆర్‌ఎస్‌ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్య జాన్సన్‌నాయక్‌ అన్నారు. సోమవారం రాత్రి పట్టణంలోని ఏడో వార్డు పరిధిలోని మైనార్టీ కాలనీల్లో పర్యటించారు. అనంతరం పలువురు పార్టీలో చేరగా.. వారికి కండువాలు కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించారు. రాజేందర్‌, ఖలీల్‌, శ్రీనివాస్‌, జహీర్‌, సర్జిల్‌, ఇర్ఫాన్‌, షోయబ్‌ తదితరులు ఉన్నారు.

నామినేషన్‌ కోసం రూ.ఐదువేలు అందజేత

అధికారంలోకి వచ్చిన వెంటనే మారుమూల గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేస్తామని బీఆర్‌ఎస్‌ ఖానాపూర్‌ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్య జాన్సన్‌నాయక్‌ అన్నారు. మంగళవారం పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో పెంబి మండలం అంకెన సర్పంచ్‌ జాదవ్‌ కల్పన-సురేశ్‌ నామినేషన్‌ వేసేందుకు జాన్సన్‌నాయక్‌కు రూ.ఐదు వేల విలువైన చెక్కును అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు ఉన్నారు.



జాన్సన్‌కు చెక్కు అందిస్తున్న అంకెన సర్పంచ్‌

విఠల్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం

కుభీర్‌: చేసిన అభివృద్ధి చూసి మళ్లీ గెలిపించాలని ముధోల్‌ బీఆర్‌ఎస్‌ ఎమ్మెల్యే అభ్యర్థి విఠల్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని బాకోట, పాంగ్ర, గొడ్సర గ్రామాల్లో మంగళవారం బీఆర్‌ఎస్‌ నాయకులతో ఎన్నికల ప్రచారం చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతీ గ్రామంలో సీసీ రోడ్లు, తాగునీటి సౌకర్యం కల్పించామని పేర్కొన్నారు. వారి వెంట ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్‌, మాజీ జెడ్పీటీసీ చవాన్‌ శంకర్‌, మండలాధ్యక్షుడు అనిల్‌, కుభీర్‌ సర్పంచ్‌ విజయ్‌, మైనార్టీ నాయకుడు రహూఫ్‌ పాల్గొన్నారు.

లోకేశ్వరం: ముధోల్‌ ఎమ్మెల్యేగా విఠల్‌రెడ్డిని గెలపించాలని జెడ్పీ మాజీ చైర్మన్‌ లోలం శ్యాంసుందర్‌ అన్నారు. మండలంలోని బిలోలి, హవర్గా గ్రామాల్లో బీఆర్‌ఎస్‌ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బాయమొల్ల భోజన్న, కపిల్‌, నర్సింగ్‌రావు, బండి ప్రశాంత్‌, శేఖర్‌రెడ్డి, సాయారెడ్డి, దిగంబర్‌, భోజారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, సుధాకర్‌ ఉన్నారు.

ముధోల్‌: మండలంలోని చింతకుంట, చింతకుంట తండా గ్రామాల్లో మంగళవారం బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు అఫ్రోజ్‌ఖాన్‌ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పోతన్నయాదవ్‌, రాజేందర్‌రెడ్డి, రాంరెడ్డి తదితరులున్నారు.



కుంటాల: కల్లూర్‌లో బీఆర్‌ఎస్‌ నేతల ప్రచారం

కుంటాల: ముధోల్‌ ఎమ్మెల్యేగా విఠల్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ మండలంలోని కల్లూర్‌లో బీఆర్‌ఎస్‌ మండల కన్వీనర్‌ పడకంటి దత్తాద్రి, జెడ్పీటీసీ కొత్తపల్లి గంగామణి బుచ్చన్న నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. డీసీసీబీ డైరెక్టర్‌ తూర్పాటి వెంకటేశ్‌, సర్పంచ్‌ దాసరి కిషన్‌, ఎంపీటీసీ గిరీశ్‌కుమార్‌, రమణాగౌడ్‌, శంకర్‌గౌడ్‌, సవ్వి అశోక్‌రెడ్డి, దశరథ్‌, పురుషోత్తం పాల్గొన్నారు.

భైంసారూరల్‌: మండలంలోని ఎగ్గాం గ్రామంలో మంగళవారం బీఆర్‌ఎస్‌ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. విఠల్‌రెడ్డిని గెలిపించాలని మాజీ జెడ్పీటీసీ సూర్యకాంత్‌రెడ్డి ఓటర్లను కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌ మండలాధ్యక్షుడు భూమారెడ్డి, సంజీవ్‌రెడ్డి, గంగాధర్‌, సచిన్‌, మాణిక్‌రావు తదితరులు ఉన్నారు.

పోలింగ్‌ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి

నర్సాపూర్‌(జి): పోలింగ్‌ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలని జెడ్పీ సీఈవో సుధీర్‌కుమార్‌ అన్నారు. మంగళవారం మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో పోలింగ్‌ కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. కేంద్రాల్లో గాలి, వెలుతురుతోపాటు తాగునీటి వసతి, దివ్యాంగులను పోలింగ్‌ కేంద్రాల్లోకి తీసుకెళ్లేందుకు ఏర్పాటు చేసిన ర్యాంపులను పరిశీలించారు. అన్ని కేంద్రాల్లో సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఆయన వెంట ఎంపీడీవో అల్లాడి వనజ, పంచాయతీ కార్యదర్శి వీణ, బీపీవో గంగామణి, సునీత ఉన్నారు.

ఖానాపూర్‌ మండలంలో..

ఖానాపూర్‌: మండలంలోని ఎర్వచింతల్‌, బీర్నంది, కోలాంగూడ, పాతఎల్లాపూర్‌, గోసంపల్లె, దిలావార్‌పూర్‌, బావాపూర్‌(కే), కొత్తపేట్‌ గ్రామాల్లోని పోలింగ్‌ కేంద్రాలను మంగళవారం ఎన్నికల అధికారులు పరిశీలించారు. సెక్టోరల్‌ అధికారి రత్నాకర్‌రావు, రూట్‌ అధికారి రాకేశ్‌ విద్యుత్‌ సరఫరా, మరుగుదొడ్లు, తాగునీరు, పరిసరాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.



పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ సుధీర్‌కుమార్‌